క్లుప్తంగా

గురుకులం ప్రిన్సిపాల్‌గా కె.వి.రమణ


కె.వి.రమణ

బాడంగి: స్థానిక డాక్టర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల /జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.వి. రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన గతంలో కొప్పెర్ల గురుకులంలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేశారు. ఇంత వరకు ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన జి.వరప్రసాదరావు తిరిగి పీజీటీ సోషల్ లెక్చరర్‌గా కొనసాగ ను న్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం


సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్ మధుసూదనరావు, గ్రామ పెద్దలు

తెర్లాం: విజయరాంపురం గ్రామ సచివాలయంలో పనిచేసి వేరే మండలానికి బదిలీ అయిన ముగ్గురు ఉద్యోగులను సర్పంచ్ బూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లు తమ గ్రామంలో పనిచేసి ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఏ ప్రాంతానికి బదిలీపై వెళ్లినా అక్కడ కూడా ఇదే విధంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

పాఠశాలలో వసతుల పరిశీలన


పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం: గురవాం గ్రామ ప్రాథమిక పాఠశాలను ప్రైమరీ మోడల్ స్కూల్ గా ఎంపిక చేయడంతో అక్కడి వసతులను ఎంఈఓ యాగాటి దుర్గారావు సోమవారం పరిశీలించారు. పాఠశాలలో అన్ని వసతులు కల్పించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టిందని ఎంఈఓ చెప్పారు. పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దు తామని తెలిపారు.ఆయన వెంట హెచ్‌ఎం అప్పారావు, సీఆర్‌పీ రాజయ్య ఉన్నారు.

కేజీబీవీ సందర్శన


మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: కుమ్మరిపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఎంఈఓ జె.త్రినాథరావు సోమ వారం సందర్శించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినుల హాజరు, ఇతర రికార్డులు, స్టాక్‌ను, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయినులతో ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాశక్తి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, సురక్షితమైన తాగునీరు అందించాలని, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

కనీస వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: ఆశ వర్కర్లను ప్రభుత్వం క్లాస్–4 ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు కనీసవేతనాలు అమలు చేయాలని ఆశ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ .రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. పొగిరి పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరారు. ఆశ వర్కర్లకు టార్గెట్‌లు, పనిభారం తగ్గించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, అర్హులను 2వ ఏఎన్‌ఎంగా ప్రమోట్ చేయాలన్నారు. ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్యమణి, పార్వతి, రమణమ్మ, గౌరి, లక్ష్మి, సూరమ్మ, నిర్మల, వీరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన మార్గదర్శకాలను పాటించాలి

బొబ్బిలి: మహిళల ఆర్థిక స్వావలంబనకు,పేదరికాన్ని జయించేందుకు ఆదాయ మార్గాలుండే మార్గదర్శకాలను ప్రతి మహిళా పాటించాలని ప్యానెల్ న్యాయవాదులు డి.లక్ష్మీదీపవల్లి, సీహెచ్.ఎల్.వి.ప్రసన్నకుమార్ అన్నారు. మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మెప్మా పరిధిలోని మహిళలకు సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ మహిళ,వ్యక్తి చదువుకోవాలన్నారు. వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాగుపద్ధతులను పాటించాలని, ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి,మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను.. ప్రతి గడపకూ వివరిద్దాం


'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎంపీ బెల్లాన, తలే రాజేష్

- నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు నైజం
- ఎన్నికల హామీల అమలును విస్మరించి రాక్షస ఆనందం
- రెడ్‌బుక్ రాజ్యాంగంపై ఉన్న శ్రద్ధ పాలనపై ఏది..?
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎంపీ బెల్లాన, రాజేష్


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వంగర: ఎన్నికల హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు చేస్తున్న మోసాలను గడప గడపకూ వెళ్లి వివరిద్దామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ వైఎస్సా ర్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు అధ్యక్షతన శివ్వాం గ్రామంలో ఆ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను తుంగలోతొక్కి ప్రజల నోట్లో మట్టికొట్టిన ఘనత ఈ టీడీపీ కూటమి ప్రభు త్వానికే దక్కుతుందని అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా వాటిలో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండానే చేసేశామని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నార ని మండిపడ్డారు. ఎవరైనా సూపర్ సిక్స్, ఇతర హామీల గురించి ప్రశ్నిస్తే వారికి నాలుక మందమని చంద్రబాబు అనడం దుర్మార్గమని అన్నారు. చంద్రబాబువి అన్నీ మాయమాటలు, అభూతకల్పనలేనని తేలిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వానికి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంపై ఉన్న శ్రద్ధ హామీల అమలులో, పరిపాలనలో లేదన్నారు. ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పథకాల అమలు, అభివృద్ధిలో ప్రభుత్వం తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్‌పాలిటిక్స్ చేస్తూ , రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ఎంపీ మిధున్ రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.

ఇష్టారాజ్యంగా అప్పులు

కూటమి ప్రభుత్వ పాలన దారుణంగా ఉందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తలే రాజేష్ అన్నారు. పథకాలు ఏవీ అమలు చేయకపోయినా, ఎక్కడా ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోయినా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తోందని అన్నారు. పథకాలు అమలు చేయడం చేత కాని ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తోందని మండిపడ్డారు. అనంతరం 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిచెర్ల గంగారావు, సోషల్‌మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు యలకల వాసునాయుడు, కల్చరల్ విభాగంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, శివ్వాం సర్పంచ్ బొక్కేల అప్పలనారాయణమ్మ, నాయకులు బొక్కేల సత్యంనాయుడు, బొక్కేల వెంకట అప్పలనాయుడు, కాంబోతుల భగవతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి కష్టాలే..

టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ కష్టాలు తప్పడం లేదని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. విద్యార్థులు, నిరుద్యో గ యువత, మహిళలు, అన్నదాతలు అంతా అవస్థలు పడుతున్నారన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేయించిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఎరువుల కోసంరైతులు మండల కేంద్రాల్లోని ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. పీ–4తో రాష్ట్రంలోని పేద కుటుంబాలను బంగారు కుటుంబాలు చేస్తామన్న చంద్రబాబు హామీ గాలిలో కలిసిపోయిందన్నారు.

ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు


ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

రేగిడి: గ్రామాల్లో రోజూ ఇంటింటా చెత్త సేకరిస్తూ, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని గ్రీన్ అంబాసిడర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు సోమవారం ధర్నా చేశారు.ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వీరికి కనీస వేతనం రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని, నెలనెలా సకాలంలో చెల్లించాలని, గ్లౌజ్‌లు, యూనిఫాం, బూట్లు, పనిముట్లు, రక్షణ పరికరాలు, రిక్షా రిపేరు ఖర్చులు ఇవ్వాల ని కోరారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగమణికి వినతిపత్రం అందజేశారు.

గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళికపై శిక్షణ

సంతకవిటి: గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళికపై మండల కేంద్రంలోని వెలుగు సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ, సెర్ప్‌లో పనిచేస్తున్న సీసీలు, వీఓఎలకు సోమ వారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు.వెలుగు ఏపీఎం టి.దదికుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పేదరికం తగ్గింపు, పేదల కనీస అవసరాలు తీర్చేందుకు స్వయం సహాయక సంఘాలతో కలిసి ప్రణాళికలను తయారు చేయాలని చెప్పారు. పేద, నిరుపేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, జీవనోపాధి, అవకాశాలు, ఆరోగ్యం, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సహజ వనరుల అభివృద్ధి, తదితర అంశాలను ప్రణాళికల్లో చేర్చాలని తెలిపారు.ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెప్పకుండా భూములు తీసుకోవడం సబబేనా..?


తహసీల్దార్ అజు రఫీజాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

రామభద్రపురం: తాత, ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములను ఎంఎస్‌ఎంఈ పార్కు కోసమని ఏపీఐఐసీ అధికారులు తమకు చెప్పకుండా తీసుకోవడం ఎంతవరకు సబబని మండలంలోని మిర్తివలస పంచాయతీకి చెందిన గిరి జన రైతులు ప్రశ్నించారు.తమ భూసమస్యను పరిష్కరించాలని కోరుతూ మిర్తివలస పంచాయతీ పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గ్రామాల గిరిజన రైతులు ఆ గ్రామ సర్పంచ్ మజ్జి రాంబాబుతో కలిసి తహసీల్దార్ అజు రఫీజాన్‌కు సోమవా రం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము చేసుకుంటున్న భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు కోసమంటూ ఏపీఐఐసీ అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా రోడ్లు వేస్తున్నారని వివరించారు. మామిడి,జీడితోటలు కొట్టేయడంతో పాటు సాగులో ఉన్న మొక్కజొన్న పంటను సైతం ధ్వంసం చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తమకు భూమితో పాటు పంట నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించకుంటే కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకుంటామని చెప్పారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల జంక్షన్‌ల వద్ద ఎస్‌ఐ సాగర్‌బాబు ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది సోమవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేశారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. వాహన పత్రాలు, లైసెన్స్ లేని వాహనచోదకులకు హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు.


తెర్లాం జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

వ్యర్థాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

రాజాం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ)లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహ ణలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు క్లాప్ మిత్రలకు సూచించారు. మండలంలోని గడిముడిదాం, గురవాం తదితర గ్రామాలకు చెందిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద క్లాప్ మిత్ర లకు తడి, పొడి చెత్త వేరుచేయడం, సేంద్రియ ఎరువుల తయారీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ చేసేటప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు కలవకుండా చూడాలని, వాటిని ప్రత్యేకంగా భద్రపరచాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


గడిముడిదాం ఎస్‌డబ్ల్యూపీసీలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ కార్యాలయం ప్రారంభం


రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ప్రసాద్‌తో బొబ్బిలి రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు

బొబ్బిలి రూరల్: పట్టణంలో రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించామని ఆ సంస్థ జిల్లా చైర్మన్ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బొబ్బిలి రెడ్ క్రాస్ అధ్యక్షుడు, తహసీల్దార్ ఎం.శ్రీను ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సభ్యుల సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ విధులు, నియమాలు, నిబంధనలను వివరించారు. ఈనెల 30వ తేదీన బొబ్బిలి కమిటీని ప్రకటిస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు, జీవిత కాల సభ్యులు జె.సి.రాజు, ప్రవీణ్, శ్రీనివాసన్, మెర్సీబాయ్, రామకృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

రేగిడి: దేవుదల, చిన్నపుర్లి, పెద్దపుర్లి గ్రామాల్లో కేంద్ర బృంద సభ్యులు సోమవారం స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ సర్వే చేపట్టారు. మురుగు నీటి కాలువల నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, ఇంటింట చెత్త సేకరణపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, ఈఓపీఆర్‌డీ జగన్నాథరావు, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ, సర్పంచ్ ఎర్నేన సుగుణ, ఉన్నారు.

మారెడుబాకలో..

రాజాం సిటీ: మారెడుబాక గ్రామంలో చేపడుతున్న స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ సర్వేను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. సర్వేను సక్రమంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ప్రజలను నమ్మించి మోసం చేశారు


చంద్రబాబు మోసాలను పెదమేడపల్లిలో మహిళలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెంటాడ: సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలను నమ్మిం చి మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయపల్లి రామారావు అన్నారు. మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మయూరి అప్పలనాయుడు, జనార్దన్, చిన్నారావు, మతక సింహాచలం ఆధ్వర్యంలో 'బాబు ష్యూరి టీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసి, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించారు.వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాయి అప్పారావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, రత్నాకరనాయుడు పాల్గొన్నారు.

మోసం చేయడంలో.. చంద్రబాబు దిట్ట


హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు
- 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి విశేష ఆదరణ


శంబంగికి హారతులిస్తున్న మహిళలు

బొబ్బిలి: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు దిట్ట అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. పట్టణంలోని పాత బొబ్బిలి ఒకటో వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేసి వాటిపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని మహిళలు మూకుమ్మడిగా శంబంగి దృష్టికి తీసుకువచ్చారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగా ఆయన ముఖ్యమంత్రి అయిన మొదటి ఏడాదిలోనే అమలు చేయడాన్ని మహిళలకు శంబంగి గుర్తు చేశారు. ఈసందర్భంగా మహిళ ల తో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రతీ ఒక్కరికీ రైతు భరోసా ఇస్తున్నట్టు ప్రకటించి ఒక ఏడాది ఎగ్గొట్టారన్నారు. రెండోఏడాదైనా ఇస్తారంటే అదీ లేదన్నారు. అలాగే ఉచిత బస్సు పథకం కింద రాష్ట్రమంతా మహిళలు ఎక్కడికైనా ప్రయాణించవచ్చని ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు ఇప్పుడు కేవలం జిల్లాలో మాత్రమే మహిళలు ప్రయాణించొచ్చని చెప్పారు. కానీ నేటికీ ఆ పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఆడబిడ్డ నిధి,నిరుద్యోగ భృతి పథకాలను పూర్తిగా మర్చిపోయినట్టే ఉందని ఎద్దేవా చేశారు. యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పీ–4కు అన్వయించామని చెబుతున్నారని, అదీ కార్యరూపం దాల్చడం లేదన్నారు. జగన్ మోహనరెడ్డి పాలనకు చంద్రబాబు పాలనకు నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే ఏడాది పాలనలో ఏం ఉద్ధరించారో చెప్పాలని, పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపుల కోసం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడమే తప్ప ఈ ప్రభుత్వంలో ప్రజలకు మరేం ఒరిగిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లిన శంబంగి, ఇతర నాయకులకు మహిళలు బ్రహ్మరథ పట్టారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీ కృష్ణారావు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, పాత బొబ్బిలి మున్సిపల్ కౌన్సిలర్ కోట పెదరాములు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), పలువురు కౌన్సిలర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాబోధనపై దృష్టిపెట్టండి


నాయుడువలప ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: ఉపాధ్యాయులు తమ తీరుమార్చుకుని విద్యాబోధనపై దృష్టిసారించాలని ఎంఈఓ తిరుమలప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని నాయుడువలస ప్రాథ మికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు రోజూ సకాలంలో పాఠశాలకు చేరుకుని, వెంటనే మొబైల్ ఫోన్‌ను హెచ్‌ఎం వద్ద డిపాజిట్ చేయాలన్నారు. తరగతుల సమయంలో ఎవ్వరూ సెల్‌ఫోన్ వినియోగించకూడదని సూచిం చారు. నాణ్యమైన విద్యనందిస్తూ విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం..

పాఠశాలల్లో సమస్యలపై స్పందించని, విద్యాశాఖ సూచించిన పనులను చేయని హెచ్‌ఎంలపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంఈఓ–1,2లు తిరుమల ప్రసాద్, పెంటయ్య హెచ్చరించారు.మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో 91 మంది విద్యా ర్థుల పేర్లు డ్రాప్ బాక్సులో ఉన్నాయని, వారు ఎక్కడున్నారు, ఏ పాఠశాలలో చేరారో హెచ్‌ఎంలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. ఇటీవల విద్యార్థులకు ఇచ్చిన విద్యాకానుక కిట్లు వారికి అందినట్లు తల్లిదండ్రులతో బయోమెట్రిక్ వేయించాలని సూచించారు. పలు పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు అవేమీ పట్టించుకోవడం లేదు సరికదా తాము ఫోన్‌లు చేసినా స్పందించడం లేదని అన్నారు. పాఠశాలలో సమస్యలను పట్టించుకోని, ఫోన్‌లకు స్పందించని, విద్యాశాఖ చెప్పిన పనుల్లో నిర్లక్ష్యం వహించే హెచ్‌ఎంలకు మెమోలు ఇవ్వడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా


బొబ్బిలి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



బాడంగి: ఐసీడీఎస్ కార్యాలయంవద్ద ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి/బాడంగి: తమ సమస్యలను పరిష్కరించడంతో పాటు తమకు, లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్ హాజరు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బొబ్బిలి, బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమసమస్యలను ఏకరువు పెట్టారు. బాలసంజీవని యాప్‌ద్వారా మాత్రమే సరుకులు ఇవ్వాలన్నారు.అలా కాకుండా సరుకులు ఇచ్చేటప్పుడు ఫొటోలు తీసి పెట్టాలని ఇప్పుడు అమలు చేస్తున్న విధానం ఇబ్బందికరంగా ఉందన్నారు. తల్లులు,గర్భిణులు, చిన్నారుల ఫొటోలను ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు నెట్‌వర్క్ సరిగా లేని కారణంగా వారు గంటల తరబడి వేచి ఉండలేక అవస్థలు పడుతున్నారన్నారు. సరుకులు కూడా ఒకసారి ఒకటి మరోసారి ఇంకొకటి ఇవ్వడం వల్ల కాలయాపన ఎక్కువవుతోందన్నారు. తమకు ఇచ్చిన ఫోన్లలో దాదాపు 90 శాతం పనిచేయడం లేదన్నారు. వాటి స్థానంలో నెట్ స్పీడ్ గా ఉండేలా కొత్త ఫోన్లు ఇవ్వాలన్నారు. సరుకుల పంపిణీ మొత్తం నెట్‌వర్క్ లేని ఏరియాల్లో కూడా ఫోన్ల ద్వారానే జరగాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని, దీని వల్ల ప్రీ స్కూల్ దెబ్బతింటోందన్నారు. లబ్ధిదారులు సంతకం పెట్టి సరుకులు తీసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొబ్బిలిలో సీడీపీఓ జె. విజయలక్ష్మికి, బాడంగిలో ఐసీడీఎస్ అధికారికి మెమొరాండం సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, సీఐటీయూ బాడంగ మండల కార్యదర్శి సురేష్,బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


రేగిడి: కోడిశ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు,తదితరులు


వంగర: జయరాజు మాస్టారును సన్మానిస్తున్న ఎంఈఓ ప్రవీణ్‌కుమార్, గ్రామస్తులు

రేగిడి: కోడిశ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులను ఆ గ్రామస్తులు, సహోపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు పల్లి వెంకటరమణ, డోల గణనాథ, ఎం.గౌరీశంకర్, శంకర్, బి.సునీత, రాజేశ్వరరావుకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు.ఎంఈఓ ప్రసాదరావు, హెచ్‌ఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నీలయ్యవలసలో..

వంగర: నీలయ్యవలస ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయుడు చేబోలు జయరాజును ఆ గ్రామస్తులు,సహోపాధ్యాయులు సోమవారం సన్మానించారు. ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఖండాపు సత్యవతి, తెంటు కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.